
# నేనెవర్నో తెలిసింది

ఎలక్ట్రాన్



"యూనివర్సిటీలో చదువుతోన్న రోజులవి. ఓ ఆదివారం ఉదయం ముసాబుగా ఉంది. నల్లని చిక్కటి సముద్రంలో, కెరటాలు తెల్లని నురగల్ని వెదజల్లుతున్నాయి, హోరు గాలి నరాల్ని జివ్వుమనిపిస్తోంది.

ఏదో సినిమాకి పోయి వెచ్చగా కూర్చోవాలనిపించింది. వెధవ సి–గదిలో రగ్గు కప్పుకొని పడుకొంటే వెచ్చగా ఉండదూ? ఉంటుంది — కాని సినిమా చూడాలన్న కోరిక ఎక్కువగా ఉండటం మూలాన, పక్కగదికి పోయి సుబ్బారావుని కదిపాను. అతగాడికి యిష్టం లేకపోయినా, బలవంతంగా లేవదీసాను. సిటీబస్‌కి డబ్బులిచ్చాను. సినిమాహాలు దగ్గర నాలుగురూపాయిలిచ్చి టిక్కెట్లు తీశాను. కిళ్ళీ దుకాణంలో సిగరెట్లు కొంటూండగా,

"బాబూ ధర్మం" అంటూ ఓ బక్కచిక్కిన ముసల్ది చెయ్యిజాచింది. ఆమెని తప్పించుకొంటూ లోపలికి దారితీశాము. సినిమా చూస్తూన్నప్పుడు రెండు మూడు మార్లు వళ్ళు వేడెక్కింది కాని, నేను ఆశించినవెచ్చదనం మట్టుకు లభించలేదు. సినిమామొత్తంమీద చెత్తగా ఉంది. సుబ్బారావుకి తలనొప్పి వచ్చిందని నా మీద

విరుచుకుపడ్డాడు. దారి పొడుగునా సాధిస్తూనే ఉన్నాడు.

ఆకలితో అలమటించే ఓ ముసలిదానికి ఒక్క పైసా కూడా విదల్చలేకపోయాను కాని, కంపెనీ కోసమని యిష్టంలేనివాణ్ణి బలవంతంగా సినిమాకు తీసుకెళ్ళి, ఖర్చులన్నీ భరించాను. తిట్లుకూడా తిన్నాను. నాకు మనసదోలా అయిపోయింది.

నాలుగు రోజుల తర్వాత త్యాగరాజుతో బజారులో నడుస్తోండగా, రోడ్డు కవతలగా చెత్తకుండీ పక్కన కూర్చుని అడుక్కొంటూన్న ఆ ముసలిది కనుపించింది. అప్రయత్నంగా జేబులోకి చెయ్యి వెళ్ళి, ఓ రెండు రూపాయల నోటు బయటకు వచ్చింది. రోడ్డు దాటి వెళ్దామనుకొంటూండగా, సిటీ బస్ అడ్డమొచ్చింది. ఒక్క క్షణం ఆగాను.

"పని కట్టుకొని, రోడ్డు దాటి ముష్టిదానికి రెండు రూపాయలిచ్చేశాడు. వీడు పిచ్చివెధవలా ఉన్నాడు" అని త్యాగరాజు అనుకోడూ ? అనుకొంటాడనిపించింది. పైకి తీసిన నోటు మళ్ళీ జేబులో పెట్టేశాను. త్యాగరాజుతో నడుచుకొంటూ వెళ్ళిపోయాను.

"కొత్తగా ఉద్యోగం చేస్తున్న రోజులు. మళ్ళీ ఓ ఆదివారం. హోరుమంటూ వర్షం కురుస్తోంది. వర్షంతో పాటు జోరికల తుఫాను. వెచ్చగా రగ్గు కప్పుకొని, ఏదో నవల చదువుతున్నాను. అట్టమీదనున్న ఆడదాని బొమ్మ దిగంబరంగా ఉంది. పనిమనిషి చంద్రి చీపురు పట్టుకొని, గదిలోకివచ్చి తుడవడం మొదలుపెట్టింది. ఇరవైయేళ్ళ వయసు చంద్రిని చాలా అందంగా చేసింది. చంద్రి వంగుని తుడుస్తోంటే, నాలుగైదుసార్లు దొంగచూపులు చూశాను. మరోసారి చూసినప్పుడు పమిట జారిపోయి ఉంది. చంద్రి అవయవాల సొంపులు నాలో అగ్నిపర్వతాల్ని బ్రద్దలుకొట్టాయి. మంచంమీదనుంచి లేచి, చంద్రిని వాటేసుకోవాలనిపించింది. వెర్రి ఆవేశంతో లేవబోయాను. చంద్రి చూపులు నా చూపులతో కలిశాయి. మరుక్షణంలో చేతిలో ఉన్న పుస్తకాన్ని పక్కన పడేసి, దినపత్రిక అందుకొన్నాను. చంద్రి జారిపోయిన పమిటను సర్దుకొని, గది తుడిచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆదివారం గదిలోనే ఉన్నాను చంద్రి రాలేదు. పనిలోకి రావడం మానేసింది.

పక్కింటి ప్లీడరు గారబ్బాయి లేవదీసుకుపోయాడు. పదిహేను సంవత్సరాల తర్వాత ఓ రోజు హైద్రాబాద్ వెళ్ళే బండికోసం ఎదురుచూస్తూ, విజయవాడ స్టేషన్లో పచార్లు చేస్తున్నాను. "బాబూ ధర్మం" అన్న ఓ ఆడదాని గొంతు విని పక్కకు తిరిగి చూశాను—రోగాలతో కుళ్ళిపోయి, దీనాతిదీనమైన చూపుల్తో చెయ్యిచాచిన చంద్రి! అప్రయత్నంగా పది రూపాయల నోటు


తీసి ఆమె చేతిలో పెట్టాను. దిగ్భ్రమగా నా కేసి చూసింది. "నిక్షేపంలా ఉండవలసినదానివి, ఏమిటిది?!" అనగల్గాను. నన్ను గుర్తుపట్టింది.

"అందరూ మీలాంటి దొడ్డ మనసుకలవాళ్ళే అయితే, మాలాంటివాళ్ళు, యిలా మోసపడక పోదురు బాబూ!" అంటూ వెళ్ళిపోయింది. చంద్రి పతనానికి కారకులయిన వాళ్ళలో, నేనూ ఒకణ్ణి కానందుకు సంతోషించాను. అయినా, ఆ రోజున నాలో పగిలిన అగ్నిపర్వతాల సంగతి చంద్రికి తెలియదు. తెలిస్తే పై మాటలు అనకలిగేదా? ఆమె పొగడ్తకి నేనర్హుణ్ణి కాదు—

"ఆఫీసు పనిమీద కలకత్తా వెళ్ళి నెలరోజుల తర్వాత తిరిగివచ్చాను. మా ఆఫీసు జీప్ డ్రైవర్ని పనిలోంచి తీసివేశారు. పెట్రోలు దొంగతనంగా తీసుకుపోతోంటే పట్టుబడ్డాడట. నా తోటి ఆఫీసరు విచారణ జరిపాడట. నేరం ఋజువు కావడం మూలాన పనిలోంచి తీసేశారు. నేను వచ్చిన రోజునే డ్రైవర్ నూకరాజు వచ్చి కాళ్ళమీద పడ్డాడు, తిరిగి ఎలాగైనా ఉద్యోగం యిప్పించమని. నేను ఎంత ప్రయత్నించినా నూకరాజుకి ఉద్యోగం యిప్పించలేకపోయాను. మరొకచోట ఉద్యోగం దొరికేంతవరకూ అతగాడికి చేతనైన సహాయం చేస్తానని మాటఇచ్చి పంపించేశాను. నా మనసు పాడైపోయింది. ఉద్యోగానికి రాజీనామా యివ్వాలనిపించింది. ఎందుకంటే— ఎన్నోసార్లు మా ఆఫీసర్ల ఆడవాళ్ళు ఆ జీప్‌లో మార్కెట్లకి, షాపింగ్‌లకి తిరిగారు. రోగాలూ, రొచ్చులూ వచ్చినప్పుడు ఆస్పత్రులకి, కులాసాగా ఉన్నప్పుడు విలాస యాత్రలకి ఆ జీప్ తిరిగింది. అయితే ఇవన్నీ జీప్‌ని ఆఫీసు పనులకు తప్పిన దూరంలో కలిసిపోయాయి! మాకూ, నూకరాజుకీ తేడా ఏమిటి? నూకరాజు నిలదీసి, ఈ ప్రశ్న అడిగితే సమాధానమేముంది — రాజీనామా యిద్దామన్న ఆవేశం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. పాతికేళ్ళ సర్వీసుని గంగపాలుచేసి, భవిష్యత్తుని ఎలా అంధకారం చేసుకొనేది? ఆ ఆలోచన అలానే అణగారిపోయింది. ఉద్యోగంలో మరో రెండు మెట్లు పైకివెళ్ళిన తర్వాత రిటైరయ్యాను.

"ఇవి నా జీవితంలో కొన్ని సంఘటనలు. ఇప్పుడు చెప్పండి మీరు నా గురించి ఏమనుకొంటున్నారో?" ప్రశ్నించాను. మన తత్వశాస్త్రవేత్త కోదండపాణి చిరునవ్వు నవ్వాడు.

"మీ ఆత్మపరిశీలనే—జీవితంలో విజయాల్ని సాధించడానికి దోహదం చేసింది. దాని మూలానే మీరు చాలా సక్రమమైన జీవితాన్ని గడపగల్గారు.




ఇప్పుడు మీరు మానసికంగానూ, శారీరకంగానూ విశ్రాంతి పొందాలి. ఈ మందులు..."

ఓ రోజు సాయంత్రం, గంటల తరబడి కురిసిన వర్షం వెలిసింది. ఇంటి ఆవరణలో ఓ నీటి మడుగు ఏర్పడింది. నా మనవలిద్దరూ ఆటలకి దిగారు. ఉన్నట్టుండి పెద్దవాడన్నాడు,

"ఒరేయ్, ఇవతల్నుంచి అవతలకు దూకాలి!" రెండోవాడు కొంచెం దూరం వెళ్ళి, పరుగెత్తుకొంటూ వచ్చి దూకాడు. కానిఆవతలివైపుకు వెళ్ళలేక, నీళ్ళలోనే పడ్డాడు. బట్టలన్నీ తడిసిపోయాయి. లేచి ఏమీ జరగనట్టుగా వంటి కంటిన బురదని విదుల్చుకొంటున్నాడు. వాడి కళ్ళలో ఏదో ఆనందం! పెద్దవాడు చూస్తూ ఉండిపోయాడు. చిన్నవాడు అన్నని హేళన చేస్తున్నాడు.

"పడిపోతామన్న భయంతో ఉంటే నువ్వు ఎలా దూకుతావు? నువ్వొత్త పిరికి వాడివి!"

నా పెద్ద మనవణ్ణి అందరూ నా పోలికే అంటారు! పేరు కూడా నాదే నేనెవర్నో నాకు తెలిసింది!

